AKSHARA TODAY

అక్షర నేటిడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

నవదివ్య రూపం.. కూష్మాండ దేవి



2



2

మొరం లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, 6వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ గఫార్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఇళ్ల పద్ద ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ మాజీ వైస్ ఛైర్మన్ ప్రశాంత్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ జీవన్, కౌన్సిలర్ చంద్రయ్య, కోఆప్షన్ సభ్యులు పప్పు వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు శివానంద్, ఎర్రోళ్ల బాబు, కాశీరాం తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి కోసం స్పెషల్ ఫండ్ ఇవ్వాలి : ఎమ్మెల్యే ధన్‌పాల్

అక్షరటుడే, ఇందూరు: నియోజకవర్గ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఫండ్ ఇవ్వాలని, ఇప్పటికే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 26వ డివిజన్‌లో చేపట్టే రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఏడాది కార్పొరేషన్‌లో పాలక వర్గం లేకపోవడం, కౌన్సిల్ సమావేశం జరగకపోవడంతో నిధులు లేవన్నారు. ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రతి డివిజన్‌కు రూ. 20 లక్షలు కేటాయించారన్నారు. వీటితో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు అలాగే ప్రతి డివిజన్‌కు రూ.కోటి పనులు కూడా ప్రారంభమవుతున్నాయని తెలిపారు. అర్బన్ చాలెంజ్ ఫండ్, ఖిల్లా రామాలయంలో రోప్ వేకు డీపీఆర్ కూడా సిద్ధమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, కార్పొరేటర్ బంటు రాము, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, మారావార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలి : పల్లె గంగారెడ్డి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర మంత్రిని పసుపు బోర్డు కార్యకలాపాలను పల్లె గంగారెడ్డి వివరించారు. అనంతరం పసుపు రైతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యలకు తగిన పరిష్కారాలు చూపించి, పసుపు రైతులకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దానికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ అధ్యక్షుడు సాయిరెడ్డి, అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.



జిల్లాలో 'ఆపరేషన్ కవచ్' ఫలితాలు పోలీసు శాఖకు ఎనలేని పేరు తీసుకువచ్చాయి. క్లిష్టమైన కేసుల ఛేదన, ముందస్తు చర్యలతో ప్రమాదాలు, చోరీలు జరగకుండా ఆపరేషన్ కవచ్ కట్టడి చేసిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అయితే అదే 'ఆపరేషన్ కవచ్'పై ప్రస్తుతం ప్రజల నుంచి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏటీఎం చోరీతో పాటు ఇటీవల జరిగిన ఘటనలు పోలీసు శాఖ ప్రతిష్టకు మచ్చగా మారుతున్నాయన్న చర్చ ప్రజల్లో బలంగా వినిపిస్తోంది.

- అక్షరటుడే, కామారెడ్డి

నిద్రలో నిఘా వ్యవస్థ..?

■ వరుస చోరీలతో పోలీసు శాఖకు మచ్చ ■ సంచలనం సృష్టించిన గాంధారి ఏటీఎం చోరీ ■ నిఘా వైఫల్యంపై ఎస్పీ సీరియస్.. సిబ్బందిపై చర్యలు ■ కిందిస్థాయి సిబ్బందిలో మొదలైన భయం

కామారెడ్డి జిల్లా లో పోలీసులు రాత్రిపూట పెట్రోలింగ్ చేస్తున్నారా అనే అనుమానం ప్రజల్లో బలంగా వ్యక్తం అవుతోంది. నేరాల నియంత్రణకు ఆపరేషన్ కవచ్ పేరుతో ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు ఉన్నతాధికారులు ప్రకటించిన ప్పటికీ, వరుసగా జరుగుతున్న చోరీలు, హత్యలు ఆ ప్రకటనలకు విరుద్ధంగా కనిపిస్తున్నాయి. దీని ఫలితమే పలువురు సిబ్బందిపై ఎస్పీ కఠిన చర్యలు తీసుకోవడానికి కారణమయ్యాయని ప్రచారం సాగుతోంది.

నిఘా వ్యవస్థపై అనుమానాలు

జిల్లాలో పోలీసు నిఘా వ్యవస్థ విఫలమైందన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతోంది. రాత్రి 10 గంటల తర్వాత ప్రధాన రహదారుల్లో, కమర్షియల్ ఏరియాల్లో సైరన్‌తో కూడిన పోలీసు వాహనాలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా, పెట్రోలింగ్ లేకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని వాపోతున్నారు. ముఖ్యంగా సదాశివనగర్, గాంధారి, కామారెడ్డి పట్టణ పరిధిలో నిఘా కొరవడిందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

వరుస చోరీలతో..

గత వారం రోజుల్లో జిల్లాలో వరుసగా మూడు పెద్ద ఘటనలు జరగడం పోలీసు శాఖకు మచ్చగా మారింది. కోటారి గల్లీలో ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని ఇంట్లో పని చేసే పనిమనిషి దంపతులే హత్య చేసి బంగారం ఎత్తుకెళ్లడం, కల్కినగర్‌లో మహిళ కంట్లో కారం చల్లి చైన్ లాక్కోవడం, ఇప్పుడు గాంధారిలో ఏటీఎం చోరీ.. ఇలా వరుస ఘటనలు శాంతిభద్రతలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి..

సంచలనం..గాంధారి ఏటీఎం చోరీ

ఆదివారం అర్ధరాత్రి గాంధారి మండల కేంద్రంలోని ఎస్బీఐ ఏటీఎంలో జరిగిన చోరీ జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రతిరోజూ రూ.కోట్లల్లో లావాదేవీలు జరిగే కమర్షియల్ ఏరియాలో ముగ్గురు దొంగలు నైటీల్లో స్కార్పియో వాహనంలో వచ్చి, నిమిషాల వ్యవధిలో ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి ఏకంగా రూ. 25 లక్షల వరకు ఎత్తుకెళ్లడం పోలీసులకు సవాల్‌గా మారింది. సీసీ కెమెరాల్లో దొంగల ముఖాలు మాస్కులతో కనిపించడం, వారు వాడిన వాహనం నెంబర్ ప్లేట్ లేకుండా ఉండటం దర్యాప్తును మరింత క్లిష్టతరం చేస్తోంది.

ఎస్పీ సీరియస్..

ఈ వరుస ఘటనలపై జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తీవ్రంగా స్పందించారు. గాంధారి ఏటీఎం చోరీ ఘటనలో విధుల్లో నిర్లక్ష్యం వహించారని సదాశివ్ నగర్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న నలుగురు హోంగార్డులను సస్పెండ్ చేశారు. అంతేకాకుండా సదాశివ్ నగర్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై జగదీష్, ఏఆర్పీసీ సంజీవరావులకు ఛార్జిమెమోలు జారీ చేశారు. నిఘా వైఫల్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ఎస్పీ హెచ్చరించినట్లు సమాచారం.

ఎస్పీ తదుపరి చర్యలపై ఉత్కంఠ

ఎస్పీ తీసుకున్న కఠిన చర్యలతో కిందిస్థాయి సిబ్బందిలో భయం మొదలైంది. ఇప్పటికే నలుగురిని సస్పెండ్ చేయడంతో, తదుపరి ఎవరిపై వేటు పడుతుందోనని హోంగార్డులు, కానిస్టేబుళ్లలో ఆందోళన నెలకొంది. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరి లొకేషన్, సీసీ కెమెరాల పుటేజీని ఎస్పీ కార్యాలయం నుంచే పరిశీలిస్తున్నారని తెలియడంతో చాలామంది అప్రమత్తమయ్యారు.

పెట్రోలింగ్ జరిగేనా..?

వరుస ఘటనలపై ప్రజల్లో భయం మొదలైంది. ఇల్లు తాళం వేసి బయటకు వెళితే భద్రత ఉంటుందా అనే భయం ప్రజలను వేధిస్తోంది. పట్టణం, కాలనీలు, శివారు ప్రాంతాల్లో పోలీస్ పెట్రోలింగ్ జరగడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వీరామంగా జరిగేలా జిల్లా పోలీసు బాస్ చర్యలు తీసుకుంటారా..? సమస్యాత్మక ప్రాంతాల్లో పెట్రోలింగ్ ముమ్మరంగా కొనసాగిస్తారా అనేది వేచి చూడాలి.



ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా నీటి విడుదల

అక్షరటుడే, పోచంపాడ్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువ ద్వారా బుధవారం నీటి విడుదలను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. రోజుకు 5వేల క్యూసెక్కుల చొప్పున వారం రోజుల పాటు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. జగదీష్ తెలిపారు. 1,091 అడుగుల గరిష్ట నీటిమట్టం సామర్థ్యం కలిగిన శ్రీరాంసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1,079 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

బీజేపీ మహిళా మోర్చా నూతన కార్యవర్గం నియామకం



అక్షరటుడే, కామారెడ్డి: బీజేపీ కామారెడ్డి జిల్లా మహిళా మోర్చా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు ఆదేశాల మేరకు మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ పావని రెడ్డి నూతన కమిటీని ప్రకటించారు. ఈ నియామకాల్లో కామారెడ్డి కి చెందిన వినోద పాటిల్‌కు ప్రధాన కార్యదర్శిగా అవకాశం దక్కింది. ప్రస్తుతం ఆమె కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 35వ వార్డు కౌన్సిలర్ గా కొనసాగుతున్నారు. వినోదతో పాటు బిక్కందకు చెందిన రాథోడ్ సునీత కూడా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే ఉపాధ్యక్షురాలిగా మాచారెడ్డి నుంచి హారిక, ఎల్లారెడ్డి నుంచి సుజాత, బాన్సువాడ నుంచి రేణుకా గౌడ్ నియమితులయ్యారు. కార్యదర్శులుగా కామారెడ్డికి చెందిన వినీల నియమితులయ్యారు. అలాగే కామారెడ్డికి చెందిన కవిత, ఎల్లారెడ్డి నుంచి రజిత, బాన్సువాడ నుంచి ఐశ్వర్యలు కూడా జిల్లా కార్యదర్శులుగా నియమితులయ్యారు. జిల్లా కోశాధికారిగా సుశీల, మీడియా కన్వీనర్‌గా దోమకొండకు చెందిన సుజాత, సోషల్ మీడియా కన్వీనర్‌గా సునంద, ఐటీ కన్వీనర్‌గా అంకిత, ఆఫీస్ సెక్రటరీగా లక్ష్మి తదితర పదవుల్లో మొత్తం 22 మందిని నియమించారు.

15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా ఈనెల 15, 16 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు (స్పెషల్ క్యాంపెయిన్) నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా ప్రతి బూత్ లెవల్ అధికారి తమకు కేటాయించిన నిర్దేశిత ప్రదేశంలో అందుబాటులో ఉంటారని అన్నారు. ఓటర్లకు అవసరమైన ఫారం 6, ఫారం 7, ఫారం 8లతో పాటు ముసాయిదా ఓటరు జాబితాను అందుబాటులో ఉంచుతామన్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన వారు ఫారం 6 ద్వారా, ఓటరు జాబితాలోని పేర్ల తొలగింపు లేదా అభ్యంతరాలకు ఫారం 7 ద్వారా, ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు, చిరునామా మార్పు వంటి వాటికి ఫారం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారులతో పాటు బూత్ లెవల్ ఏజెంట్లు కూడా అందుబాటులో ఉండాలని, ముసాయిదా ఓటరు జాబితాను ఓటర్లు పరిశీలించేందుకు సహకరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు, అవసరమైన సవరణలు, మార్పులు లేదా కొత్తగా ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపెయిన్ రోజుల్లో తమ సమీప పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఢిల్లీలో బిజీబిజీగా ఎంపీ అర్వింద్..



అక్షరటుడే,నెట్‌వర్క్: న్యూఢిల్లీలో ఎంపీ ధర్మపురి అర్వింద్ బిజీబిజీగా ఉన్నారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం, వాణిజ్య కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారు. న్యూఢిల్లీలో అక్టోబర్ 12,13 తేదీల్లో జరిగిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టం సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో ఎంపీ అర్వింద్ పాల్గొన్నారు. ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లును సమగ్రంగా పరిశీలించేందుకు ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశాల్లో విదేశీ విరాళాల నియంత్రణ, వాటి వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం, చట్టపరమైన నిబంధనల అమలు వంటి కీలక అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో వివిధ మత, సామాజిక, సేవా సంస్థల ప్రతినిధులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, న్యాయ నిపుణులు, విద్యాసంస్థల ప్రతినిధుల నుంచి బిల్లుపై అభిప్రాయాలు, సూచనలను కమిటీ స్వీకరించింది. విదేశాల నుంచి అందే నిధులు చట్టబద్ధమైన మార్గాల్లో వినియోగించబడేలా చూడటం, నిధుల వినియోగంలో పారదర్శకతను పెంపొందించడం, సంబంధిత సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం వంటి అంశాలు ఈ సమావేశాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన వాణిజ్య కమిటీ సమావేశంలోనూ ఎంపీ అర్వింద్ ధర్మపురి పాల్గొన్నారు. దేశ వాణిజ్య రంగ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, ఎగుమతుల ప్రోత్సాహం, దేశీయ పరిశ్రమలకు అవకాశాల కల్పన, వాణిజ్య రంగంలో ఎదురవుతున్న సవాళ్లు వంటి అంశాలపై పార్లమెంటరీ కమిటీల ద్వారా జరిగే పరిశీలనలు, చర్చల్లో ఆయన పాలు పంచుకున్నారు. ఈ



కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణం బతుకమ్మ పాటలతో మారుమోగిపోయింది. టీఎన్జీవోస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు తీరొక్కపువ్వులతో బతుకమ్మలను పేర్చి.. వాటిచుట్టూ ఆడిపాడారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరై సంబురాల్లో పాలుపంచుకున్నారు. మొదట గౌరిపూజచేసి సంబరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్‌కుమార్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

– అక్షరటుడే నిజామాబాద్ సిటీ

అక్షరటుడే
TOWARDS... TRUTH. TRUST. TREND

2

నిజామాబాద్/కామారెడ్డి
బుధవారం
14.10.2026

www.aksharatoday.in
AKSHARA TODAY

కానిస్టేబుల్ రఘు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి



అక్షరటుడే, బాన్సువాడ: విధి నిర్వహణలో ఉండగా మరణించిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని కామారెడ్డి జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి బుధవారం వినతిపత్రం సమర్పించింది. కామారెడ్డి జిల్లా పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. గాంధారి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ కె.రఘు జూన్ 9న అనారోగ్య కారణాలతో మరణించడం పోలీస్ శాఖకు, ఆయన కుటుంబానికి తీరని లోటన్నారు. ఆయన భార్య రజనికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి వచ్చిన రూ.50 లక్షల చెక్కును పోచారం రఘు కుటుంబానికి అందజేశారు.



బండారుపల్లిలో బతుకమ్మ సంబరాలు

అక్షరటుడే, బోధన్: మండలంలోని బండారుపల్లిలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది దుర్గామాత ప్రతిష్ఠాపన నాల్గోరోజు బతుకమ్మ సంబరాలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ మేరకు గ్రామంలోని మహిళలు బతుకమ్మలను అందంగా పూలతో పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి వాటిచుట్టూ ఆడిపాడారు. గ్రామంలోని అందరిని బతుకమ్మ చల్లగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు సర్పంచ్ కాడి సాయిలు తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి ఆడపడుచులు వచ్చి పండుగను నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. గణేష్ పటేల్, మారుతి పాల్గొన్నారు.

రిజర్వేషన్ ఫలాలపై రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



అక్షరటుడే, కామారెడ్డి: రిజర్వేషన్ ఫలాలు పేదలకు అందడం లేదంటూ దేశవ్యాప్తంగా చేపట్టనున్న రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం కామారెడ్డిలో ఆవిష్కరించారు. రాష్ట్ర రెడ్డి ఐక్య వేదిక అధ్యక్షుడు నాగర్తి చంద్రారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో జరుగుతున్న రిజర్వేషన్ల విషయంపై సామాజిక కార్యకర్త ప్రవీణ్ అరోరా దేశవ్యాప్త రథయాత్రకు సంకల్పించారన్నారు. అక్టోబర్ 2వ తేదీన ప్రారంభమయ్యే ఈ రథయాత్ర దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలలో 20 వేల కిలోమీటర్లు సాగుతుందన్నారు. తెలంగాణలోకి ఈ రథయాత్ర అక్టోబర్ 23వ తేదీ రాత్రి ఆదిలాబాద్ జిల్లా ద్వారా ప్రవేశిస్తుందన్నారు. 24వ తేదీ ఉదయం 9 గంటలకు అంబేద్కర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్ నిర్వహించి అక్కడి నుంచి నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్ మీదుగా సాయంత్రం కామారెడ్డికి చేరుకుంటుందన్నారు. కామారెడ్డిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు.







నవదివ్య రూపం.. కూష్మాండ దేవి

ఉమ్మడిజిల్లాలో భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. వివిధ రూపాల్లో కొలువైన అమ్మవార్లను భక్తులు భక్తితో కొలుస్తున్నారు. ఇందూరులో ఆయా మండపాల్లో ఏర్పాటుచేసిన అమ్మవార్ల విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బుధవారం దుర్గాదేవి కూష్మాండ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్
















విద్యుత్ కోతలను నిరసిస్తూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రాస్తారోకో

అక్షరటుడే, ఆర్మూర్ : పంటపొలాలు పొట్టదశలో ఉండగా కరెంట్ కోతల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని నిజాంసాగర్ కెనాల్ కట్టపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. మోర్చా నాయకులు మాట్లాడుతూ.. ఒకవైపు వర్షాలు ముఖం చాటేయగా..మరోవైపు ప్రభుత్వం పంటలకు సరిపోయేంత విద్యుత్తును అందించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోతుంటే రైతులకు ఫసల్ బీమా యోజన పథకం అమలులో ఉంటే కొంత భరోసా ఉండేదన్నారు. ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. నూతుల శ్రీనివాస్ రెడ్డి, కలికోట గంగాధర్, యామాద్రి భాస్కర్, బీజేపీ నాయకులు పోల్కం వేణు, వివేకానంద్, కలిగోట ప్రశాంత్, ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





జీజీహెచ్ మారదా..!

నగరంలోని జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోగులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం ఏమాత్రం తగ్గడం లేదు. ఆస్పత్రికి వచ్చే రోగులు కదల్లేని స్థితిలో ఉంటే వారిని వీల్‌చైర్‌లో తీసుకెళ్లేందుకు అటెండర్లు కరువయ్యారు. దీంతో రోగులతో వచ్చిన కుటుంబీకులే వీల్‌చైర్లు, స్ట్రెచర్లను నెట్టుకుంటూ అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి అటెండర్లను ఏర్పాటు చేస్తే రోగులకు ఇబ్బందులు తప్పుతాయని తెలిపారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



దేవతలను పూలరూపంలో కొలిచే పండుగ బతుకమ్మ



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: దేవతలను పూల రూపంలో కొలిచే పండుగ బతుకమ్మ అని సంస్కార భారతి జిల్లా ప్రధాన కార్యదర్శి మాధురి అన్నారు. పండుగలో భాగంగా లక్ష్మాపూర్, మల్కాపూర్ గ్రామంలో జరిగిన బతుకమ్మ వేడుకలకు వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో బతుకమ్మను ఆడుతున్న వారిని పరిశీలించి వారిలో బాగా పాడిన వారికి.. బతుకమ్మను బాగా తీర్చిదిద్దిన వారికి బహుమతులు అందజేశారు. సర్పంచ్ నీరజ కార్తిక్, ఉప సర్పంచ్ లక్ష్మి, వీడీసీ చైర్మన్ గట్టు గంగాధర్ బాగారెడ్డి, సంస్కార భారతి కార్యకర్తలు నగర కన్వీనర్ నగర్తి శంకర్, రమణాచారి, అవన్ కుమార్, మల్లేష్, శ్రీనివాసచారి మధుసూదనాచారి, నాగనాథ్, సయా రెడ్డి పాల్గొన్నారు.



సైబర్ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు

అక్షరటుడే, బోధన్: డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సీపీ సాయిచైతన్య సూచించారు. వర్ని పోలీస్‌స్టేషన్‌లో చింతకుంట వృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించిన అనంతరం బోధన్ డివిజన్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. డ్రగ్స్, మత్తుపదార్థాలు రవాణా చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బోధన్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హత్య , హత్యాయత్నం, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని.. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సీపీ సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. పేకాట, గుట్కా, ఇసుక ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు.

మొరం లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు



అక్షరటుడే, కామారెడ్డి : పట్టణ శివారులోని రామారెడ్డి బైపాస్ బ్రిడ్జి జాతీయ రహదారిపై బుధవారం మొరం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి నడిరోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కామారెడ్డి వైపు నుంచి మొరం లోడుతో వేగంగా వెళ్తున్న లారీ రామారెడ్డి బైపాస్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే అదుపుతప్పింది. అతివేగం, బ్రిడ్జి వద్ద ఉన్న మలుపు కారణంగా లారీ ఒక్కసారిగా నడిరోడ్డుపైనే బోల్తా పడింది. లారీలోని మొరం మొత్తం హైవేపై పడిపోవడంతో రోడ్డు పూర్తిగా మూసుకుపోయింది. ఈ ఘటనతో నేషనల్ హైవే 44పై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హైదరాబాద్ నిజామాబాద్ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు, దేవునిపల్లి పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన డ్రైవర్‌ను 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అనంతరం క్రేన్‌ను రప్పించి బోల్తాపడిన లారీని తొలగించి, రోడ్డుపై పడిన మొరంను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాలో డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలని టీజీఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ మధుసూదన్, జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్ 1) బాబురావు అధికారులకు సూచించారు. ఈమేరకు ఎస్ఈ రాజేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని డిచ్‌పల్లి, సిరికొండ, భీమ్‌గల్, పోచంపాడ్ సబ్‌స్టేషన్లను ఉన్నతాధికారులు సందర్శించారు. ఆయా సబ్‌స్టేషన్లలో 33 కేవీ ఫీడర్లపై విద్యుత్ లోడ్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్) లోడింగ్ పరిస్థితులను పరిశీలించారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ, సరఫరాలో అంతరాయాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ముందస్తుగా సమస్యలను గుర్తించి నాణ్యమైన, నిరంతర విద్యుత్‌ను వినియోగదారులకు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆరోగ్యరాజు, డివిజనల్ ఇంజినీర్లు హరిచంద్, రఘు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్లు శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దుర్గమ్మ పిరమిడ్ ధ్యాన మందిరానికి భూమిపూజ



అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో మహతి ఆశ్రమం వద్ద దుర్గమ్మ పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. అమృతధార ఆశ్రమ వ్యవస్థాపకులు హరాచారి నారాయణ స్వామి భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అమరవాజీ స్వరూప, నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ ధ్యాన మందిరాన్ని నిర్మించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఎస్ఎస్ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, అడ్వకేట్ సాయి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, పిరమిడ్లు శక్తి క్షేత్రాలుగా భావించబడుతున్నాయని తెలిపారు. పిరమిడ్ ధ్యాన మందిరాల్లో ధ్యానం చేయడం ద్వారా విశ్వశక్తిని అనుభూతి చెందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహతి ఆశ్రమం అధ్యక్షురాలు భోగరాజు నిర్మల, సర్పంచ్ గుండేటి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ అనిల్ కుమార్, హరాచారి హరి, ఉపసర్పంచ్ మూగ భోజన్న, పీఎస్ఎస్ఎం జిల్లా కార్యదర్శి డాక్టర్ అమరవాజీ శ్రీనివాస్, గౌరవ సలహాదారులు సింధుల రాజేందర్, దేవేందర్ రెడ్డి, పిరమిడ్ మాస్టర్లు కొత్తపల్లి రాజిరెడ్డి, బాలసాయి తదితరులు పాల్గొన్నారు.